# వాగ్దానం

అప్పటికప్పుడే అనేకసార్లు అనుకున్నాడు తారకనామం; తానింకెప్పుడూ ఎవరికీ యెటువంటి వాగ్దానాలూ జన్మలో చెయ్యనని! గట్టిగా లెంపలేసుకున్నాడు. అంతేకాదు. ఎన్నడూ ఏ మాటా అనియెరుగని రామావతారం కూడా అంతమాటా అనటంతో తన కేమిటో తనలాంటి వాళ్ళెవరికైనా పీక పిసుక్కుని అమాంతం చావాలనిపిస్తుంది. ఐతే తనుమాత్రం అంతపనీ చెయ్యలేకపోయాడు! చావడమంటే మాటలా మరి! అందుకు బదులుగా రెండుచెవులూ గిరగిరా మెలెట్టుకుని మరీ ఇంకెప్పుడూ మాటివ్వనని మాత్రం ఒట్టేసుకున్నాడు. కాదూ మరి! రామావతారం మాత్రం యేం తక్కువ మాటన్నాడా?!

'ఒరేయ్ తారకం నీకిదే చెప్తున్నా. సాయంత్రం మొదటాట "చెంచులక్ష్మి"కి వెళ్ళాలి మనం. నువ్వెలాగైనా ౫ గంటలకే రావాలి. లేకపోతే మహారణ్!' అన్నాడు. ఆ రోజు ఉదయం. అయితే అప్పుడు తను కూడా మనస్ఫూర్తిగానే వెళ్ళాలనుకున్నాడు ఎందుకనుకోడూ? ఖర్చుపెట్టి తీసికెళ్తానంటే తనకుమాత్రం చేదా? పోనీ చూసే అలవాటు లేదేమో అంటే వల్లమాలిన మోజు. దీనికి తోడు యింతకు ముందప్పుడే రెండుమూడు సార్లు రామావతారం రమ్మనడం, తను 'సరే' అనడం చివరకు తుస్సుమనడం జరుగుతోంది. అయినా రామావతారం కోపగించుకోనూ లేదు. పల్లెత్తుమాట కూడా అనలేదు. తనే లోలోపల సిగ్గుపడి ఛస్తున్నాడు; మాట నిలబెట్టుకోలేక పోతున్నానే అని. అందుకే నిశ్చయంగా "అదేమిటోయ్ వెర్రి సీతాపతీ నాలుగున్నరకే హాజరవుతాను, బెంగెట్టుకోకు' అని హామీ విసిరిపారేశాడు. కాకపోయినా మధ్యని ఆ కోటిగాడొచ్చి కొంప ముంచుతాడని ఎవరికి తెలుసు!

అసలు మధ్యాన్నంనించె తను చాలా హడావుడి పడుతున్నాడు; ఎలాగైనా మాట నిలబెట్టుకోవాలని, తప్పకుండా రామావతారం కోరిక మన్నించాలని. ముక్కోటి దేవతలకూ మొక్కుకుంటూ ఒక్కొక్క గంటె లెక్కపెడుతున్నాడు. అలాంటి వేళ సరిగ్గా నాలుగ్గంటల శుభసమయంలో [illegible]ంజవం వేసినట్లు దిగబడ్డాడు కోటీశ్వర్రావు. వచ్చినవాడు వచ్చినట్టుంటే బాగుండునా? అసలు వాడి స్వభావమే వేరు!

'ఏమిటోయ్ బావా! సినిమాకెళ్తున్నావా యేంటి? అంత హుషారుగా వున్నావ్' అన్నాడు.

దీనికేం సమాధానం చెప్పడం? ఔనంటే వీపుకి జీడి తప్పదు. ముక్కూ మొహం ఎరుగని పరాయివాడు కాదు. స్వయానా మేనత్త కొడుకు బావ. పోనీ అంటే తనే ఒకరి గాసుగా వెళ్తున్నాడాయె వీణ్ణికూడా వెంటేసుకెళ్ళడం అసందర్భం కాదూ! అందుకే ఒక్కమాటలో 'అబ్బె అదేం కాదని, కొట్టి

నిష్ఠల బ్రహ్మాజీ

పారేశాడు. అయినా కోటిగాడు మాత్రం అంత సులువుగా దుల్లిపోలేదు.

'అయితే మరెందుకో తొందర? కూర్చో బాబూ!' అన్నాడు.

తారకనామం బాధనంతా లోలోపలే అణచుకుని యెలాగో కూర్చున్నాడు. 'హే పరాత్పరా! దీనదయాళో! నన్ను అబద్ధాలకోరుగా వంచకుడుగానే యీ ప్రపంచంలో వాడుక పడమంటావా? ఆనాడు గజేంద్రుణ్ణి రక్షించావని పోతన్నగారన్నారు. ఈనాడుకూడా యీ మా మొసలిబావనుండి నన్ను రక్షించు బాబో!' అంటూ మార్గాంతరం అన్వేషించసాగేడు.

'ఏమిటోయ్ బావా అంతదీర్ఘంగా ఆలోచిస్తున్నావ్. చతుర్ముఖ పురాణం వేసుకుందాం మా ఇంటికి రాకూడదూ' అన్నాడు పేకాట ప్రియుడైన బావ.

తారకం గుర్రుమన్నాడు తనలో తానే.

'ఓహ్. అన్నట్టు చెప్పడం మర్చిపోయానుబావా! ఇప్పుడు నాకు వేరే పనుంది. సోమానందరావుగారింటికి వెళ్ళాలి. ఆయన కొత్తగా రాసిన "శకునపక్షి" కథల సంపుటి నాకిస్తానన్నారు,' అన్నాడు యిలాగైనా జారుకోవచ్చని!

కోటేశ్వర్రావు పకాల్న నవ్వాడు:

'ఏడ్చాడు. అసలా పక్షి యింటిదగ్గర లేంకే నే వక్కణ్ణించే వస్తున్నా సరాసరి,' అన్నాడు.

'హరి హరీ' అనుకున్నాడు తారకం.

'అయినా యింట్లో వాళ్ళకు చెప్పి వెళ్ళుంటార్లే. పర్వాలేదు.' అంటూ లేవబోయాడు.

"అది సరే కాని, చెప్పడమే మర్చిపోయాను. నేనీమధ్య కథరాశానోయ్ బావా!' అన్నాడు కోటీశ్వర్రావు జేబులోంచి ఓ కాయితాల బొత్తి పైకి తీస్తూ.

తారకం కిరకిరలాడిపోయాడు. పళ్ళు కొరుక్కున్నాడు మెల్లిగా—

'మంచిపని చేశావ్. నీకిలాంటి బుద్ధి పుట్టిందేం' అన్నాడు. కొంపతీసి ఆ గ్రంథం ఆమూలాగ్రం చదివి వినిపిస్తానంటాడేమోనన్న భయంతో అటు చూడనట్టే దృష్టి మరో దిక్కుకి మార్చాడు.

కోటీశ్వర్రావు యిదేం గమనించనట్టే మొదలెట్టాడు.

'హార్నీ. యిదేం లాకాయి 'శకునపక్షి' కథలాంటిది కాదురోయ్. పక్కా క్లాసికల్ మాస్టర్ పీస్. నవరసాల సారం కాచి వడపోసి'—

తారకానికి అంత కోపంలోనూ నవ్వు కూడా వచ్చింది:-

'నిజం నిజం. నీ వుపోద్ఘాతం వింటేనే కోకరసం ఫిల్టర్లో పోసిన కాఫీలా వూరుతోంది బావా! ఇంకా యిలా నీకు ననవసర శ్రమస్య...'

'అయితే నీకింకా నమ్మకం లేదన్నమాట. కావలిస్తే చూడు. చదివి వినిపిస్తా. నీకే తెలుస్తుంది' అంటూ కాయితం మడతలు విప్పటం మొదలెట్టాడు కోటీశ్వరావు.

తారకానికి నఖశిఖపర్యంతం చెమటలు పట్టేశాయి.

'బాబ్బాబూ! నిన్నేం అనలేదు బావా! ఏదో సరదాకన్నాని... నేన్నికన్నా మహా ఏం పొడబొడిచేను కనక. ఫెయిర్ చేసి కేప్పాదుస్తే మొయిలెక్కించెయ్. తిరిగొచ్చినా మరేం భయంలేదు. ఒకళ్ళిద్దర్ని చంపితే కాని వైద్యుడు కాడు. మరి నే

కోప్పేసా' అంటూ మరోసారి లేవటానికి ప్రయత్నం చేశాడు.

కోటేశ్వరావుకి మరింత కామద్గా అనిపించింది.

'ఆగుగో ఆ మాటే అనొద్దంటున్నాను. తిరిగిరావడం ఎందుకోయ్ నీ మొహం. నాక లంపోటు నారాయణాస్త్రం! అయినా బిగినింగ్ చూడు పోనీ—"భువనమోహన సముద్భవమైన అంభోరుహా"...

'చాల్చాలు. గ్రాండ్. ఎక్సలెంట్. బ్యూటిఫుల్ బిగినింగ్. అంతే బావా! ఆ మాత్రం చాలు. యింకేంకావాలి! శ్రీనాథుడి ముని మనవడిలా సమాస శ్రేణి గుంభించి పారేశావ్. మరి సెనింక..."

'అప్పుడే ఏం చెప్పావ్? సాంతం వినండే. వినుమరి'—

"ఆ కోమలి కుసుమకోమల కరపల్లవి..."

తారకం వాచీ చూసి గతుక్కుమన్నాడు—

'అలాకాదు బావా! నువ్వు పల్లవి పాడుకుపోతే అంత రమ్యంగా వుండదు. కాకపోయినా ప్రతీ పాఠకుడి దగ్గిరికీ వెళ్ళి నువ్వు చదివి వినిపించలేవుకదా. ఆ కాయితాలిలా యిచ్చిపో. నేను రాత్రి తీరుబడిగా చదివి చూసి భద్రంగా నీకు వాపసుచేస్తా.' అంటూ కోటేశ్వరరావు వెలాగో కొంత సేపటికి వొప్పించి, పంపి, కాయితాలు డ్రాయర్లో దాచి రోడెక్కాడు. కాని తానీ జంఝాటమంతా తేల్చుకుని గమ్యస్థానం చేరుకునేసరికి పుణ్యకాలం మించి పోయి జరగవలసినంతా జరిగింది. రామావతారం నరసింహావతారం దాల్చి అంత మాటా అనేశాడు—

'ఏరా తారకం! తిరిగెళ్ళేవాళ్ళని చూడాని కొచ్చేవా! మా బాశే! సిగ్గయినా వెయ్యలేదూ మొహానికి! నాలుగున్నర కొస్తానని కూడా కోశావ్'

నిజంగా తనకు సిగ్గేసింది. జరిగింది చెప్పేందుక్కూడా మొహం చెల్లలేదు. రామావతారం చివాట్ల దండకంతో పూర్తిగా బూజు దులిపేశాడు—

'అయినా నిన్ను నమ్ముమని యెవడు చెప్పాడు. తెలిసి తెలిసి గొడ్డు గోదారి వాణ్ని నమ్మినట్టయింది నా పని. పెళ్ళాం వెళ్ళొద్దన్నా వచ్చాను. అయినా యికమీద ఎప్పుడూ యెవరికీ యిలాంటి చాతకాని వాగ్దానాలు చెయ్యబోకు...' అని కూడా ఆఖర్న గట్టిగా అన్నాడు.

ఆ క్షణంలోనే తనుకూడా గట్టిగా అనుకున్నాడు—ఒకసారా, ఒకచోటా యిలాంటివి జరిగి మరి!

ఒసారి వంటచెరుకు తెస్తానని చెప్పి వెళ్తూ ఫుల్సాగా సినీమాభామన్న దొరికింది

(43-వ పేజీ చూడండి)



ఎంత అందమైన యువతి...

ముట్టుకొంటే కందిపోయే ఆమె లావణ్యము ఏమని చెప్పడం



ఆమె వాడేవి పూల పరిమళముగల యు-డి-కోలోన్ మరియు ఆమె యవ్వన శోభకు రక్షణనిచ్చే సహజ సువాసనతో కూడిన శుద్ధమైన యు-డి-కోలోన్ సబ్బు.

టాటావారి
యు-డి-కోలోన్ మరియు
యు-డి-కోలోన్ సబ్బు

ది టాటా ఆయిల్ మిల్స్ కంపెనీ లిమిటెడ్

TE 7144

# ★ వాగ్దానం ★

(31-వ పేజీ తరువాయి)

కదా అని కొట్టేసినందుకు ఒదినమాత్రం ఏమన్నది!

'యిదేమిటయ్యా! యిన్నేళ్ళొచ్చి యీ అబద్ధాలెందుకూ! నీకంత సాహసి అయితే మొదటే ఖచ్చితంగా చెప్పరాదూ! తీసుకు రావంటే కొరతేస్తావా!' అనడిగిందికదా! ఎంత చెప్పినా నమ్మిందా? 'కాదొదినా' అంటే 'నీ నైలు నే నెరగనా' అని కొట్టి పారేసింది. సరి అక్కడితో యింట్లో ముద్ర పడిపోయింది.

వీధిలో సంగతి సరేసరి. కొందరు 'దగా కోరు' అని పేటెలిచ్చారు. 'మక్కలోకపట్టె గోదావరీస్నానమే' అన్నారింకొందరు 'చలచిత్తం' అన్నారు మరికొందరు. ఇంకా కోపం పట్టలేక వెనక వెనక తిట్టారు కూడా కొందరు. అయితే తను దీన్ని అంతగా లక్ష్యం చేయలేదు. తన కదేవి అంత కష్టాన్ని కలిగించలేదు. అయితే తన దృష్టిలో వీళ్ళంతా ఒకెత్తూ, రామావతారం ఒక్కడూ ఒకెత్తు అలాంటి రామావతారమే తనమీద అంత కఠినత్వం వహించడం నిజంగా బాధాకరమైన సంగతే. అలాంటిది జరుగుతుందని తానెప్పుడూ అనుకోలేదు. ఊహించనుకూడా లేదు. అందుకే యిప్పుడూ హించుకున్నాడు. రామావతారం ఎంత వినిగతితే అంతమాటన్నాడా అని. అదే ఆలోచించవలసిన విషయమే మరి. అంచాతనే బాగా ఆలోచించి యీ ఘోరనిర్ణయం చేసుకున్నాడు. ఎవరికీ తానింకెప్పుడూ ఎట్టి వాగ్దానాలూ చెయ్యకని. ఇంక దానికి తిరుగులేదనుకున్నాడు. అనుకుంటూ అనుకుంటూండగానే పురుక్కున మళ్ళీ ఆ వెధవని చేశాడు. నోరు జారక నాలిక్కరుచుకుని, తొడుంబొగ్ అనేందుకు వీలేని చిక్కది. అందులోనూ తానిప్పుడు వాగ్దానం చేసింది లాకాయి లూకాయ్ లక్ష్మీపతికాదు. తనంటే యెంతో గౌరవిస్తూ, తనని గౌరవనీయుల్లో సమ్మకస్థలో ఒకడని నమ్ముతున్న ఒకఅబలకి గట్టివాగ్దానం చేశాడు. చెయ్యకతప్పని పరిస్థితొచ్చె. ఏం చేయడం?

*　　*　　*

రాజేశ్వరికి తన గురించి అట్టే తెలియదు. తనకుమాత్రం ఆమె గురించి ఎక్కువేం తెలుసాయేం! అసలు తెలుసుకోడానికైనా పెద్ద అవకాశమేదీ. తానసలు మొటమొదట రాజేశ్వర్ని చూడ్డం అన్నయ్య పెళ్ళిలో. ఆడపెళ్ళివారి తరఫున ఒచ్చిన చుట్టాలట. అటూ పోటూ కొద్దిగా వచ్చు. అప్పటికింకా వాళ్ళ స్వంతవూర్లో చిన్నక్లాసు చదువులోవుంది. కాని మొగపెళ్ళివారిమీద పాటలు పాడి కమ్మలు కటడానికి ఆ అమ్మాయిని పుసిగొల్పారు. బాగానే పాడిందికూడాను. అది చూసి ఆడపెళ్ళివారిమీద తనో రెండుఅంటించాడు. అక్కడితో యిదరికీ తాత్కాలిక సంధి జరిగింది. అది జరిగికూడా ఇప్పటికప్పుడే ఎనిమిదేళ్ళనాటి ముచ్చట. చిన్న రెక్కలగౌను తొడుక్కుని, ఎర్రగా బక్కపల్చగా వుండే ఆ రాజేశ్వరికీ, మరో వెన్నెపెరిగి, బాగాపొడుగెదిగి, చకచకా మాట్లాడే నేర్పు సంపాయించి, అనేక పావను చేర్చి చీరలు కడుతూన్న ఈ రాజేశ్వరికీ ఎక్కడా పోలిక తెలీదు.

కాలేజిలో చేరటానికని వారంరోజుల కిందటే యీవూరొచ్చింది రాజేశ్వరి. వాళ్ళ పిన్నిగారింటో మకాం. వాళ్ళ బాబయ్య వెంకటాద్రిగారు కాలేజీలో కొత్తగా రెండేళ్ళక్రిందటే ప్రవేశించిన ఫిజిక్సు లెక్చరర్. మంచి సాహిత్యాభిమాని. తనకెలాగో కొన్నాళ్ళుగా అతనితో పరిచయమై తీరిక సమయాల్లో వారింట్లో కూర్చుని మాట్లాడుకునే అలవాటయింది. అమ్మయ్య అలాంటి ఓ సందర్భంలోనే అకస్మాత్తుగా రాజేశ్వర్ని వాళ్ళింట్లో తనుచూడ్డం తటస్థించింది. ఆమె చటుక్కున గురుపట్టి "మీరుభీనాలాకాదూ" అనడిగింది. తనూ పోల్చుకున్నాడు. "ఔను మీరుకూడా భీలానాకాదూ! ఇంతలా మారిపోతే పోల్చుకోడం నాతరమా!" అన్నాడు.

వెంకటాద్రిగారు యీపరిచయం చూసి మొదట ఆశ్చర్యపోయారు. అప్పుడే రాజేశ్వరి పాతసంగతులన్నీ ఏకరువు పెట్టింది. వాళ్ళ పిన్నిగార్నికూడా పిల్చి, పరిచయం చేసి, బంధుత్వాన్ని బయట పెట్టింది. ఆ తర్వాత తతిమ్మా విశేషాలన్నీ వెంకటాద్రిగారిద్వారా విన్నారు రాజేశ్వరి తనూ. రాజేశ్వరికూడా సాహిత్యప్రియు, సంగీతారాధకు!

"ఈవూళ్ళో ప్రాసుపోవడం కష్టంగా వుంటోందండీ. కాలేజిలో జాయినయ్యాక యితే పూచీలేదు. అంతవరకూ ఇబ్బందే. అంచాత వీలయినప్పుడల్లా తండి కొస్తు" కోరిందికూడా.

ఈరోజు వుదయం పూటలా గా పెళ్ళి కాలక్షేపానికి కూర్చున్నారు తనూ, రాజేశ్వరి, వాళ్ళపిన్ని. వెంకటాద్రిగారు వీధిలోకెళ్ళారు. అమాటా యీమాటా వొచ్చి "సినిమాలంటే మా చెడ్డ సరదా" అంది రాజేశ్వరి.

తను పూరుకోవచ్చు. 'నాకూ అంతే. అవసరమైతే ఓపూట తిండయినా మానేస్తాను. కాని సినిమామాత్రం చూడకుండా పోనివ్వను" అన్నాడు కొంచెం అతిశయోక్తిగా.

రాజేశ్వరి నవ్వుతుంది.

"మీరో" అన్నాడు తాను రకం అక్కడేవున్న వాళ్ళ పిన్నిగార్ని.

"మరీ అంతపిచ్చి నాకు లేదుసుమండీ ఏదో చూస్తాను" అందావిడ.

తను నవ్వేశాడు—

"అసలింతకూ "తుమ్సా నహీ దేఖా" చూశారా?' అన్నాడు. అదైనా మాటవరసకి. కాని దర్భపుర్తే నారాయణాస్త్రం ఔతుందనుకోలేదు.

"అబ్బే. లేదండి. ఇక్కడుందిటకదూ!" అంది రాజేశ్వరి చాలా వుత్సాహంగా.

పాడు జ్ఞాపకశక్తి! చటుక్కున స్ఫురణ కొచ్చింది తమాషాగా.

"ఔను. మిలానిలో, కాని యీ నాటే లాస్ట్ సెట్," అని కూడా అందించాడు.

రాజేశ్వరి విలవిలా కొట్టుకుంది—

"ఏవిటే, యివాళ్ళతో నే సరా. అరెరె! పిన్నీ బాబయ్యతో చెప్పు పిన్నీ! ఇవాళెలాగైనా వెళ్ళొచ్చేదాం...పిక్చరు చాలా బాగుంటుంది కదండీ" అన్నది.

"బాగుండడమా! గ్రాండ్ గా వుంటుంది. తప్పకుండా చూడవలసిన దౌను. ఇంతకన్నా యెక్కువేం చెప్పేది! అయినా చూడకుండా మీరొదుల్తారా!" అన్నాడు తను మందహాసం చేస్తూ.

"ఏమోనండీ. బాబయ్యగారు వస్తారో రారో చెప్పలేం. అదే ఒచ్చిన చిక్కు," అని నొచ్చుకుంది రాజేశ్వరి.

"ఏం ఆయన కంత యిష్టం లేదా!" అన్నాడు తారకం తన కింతో యిదమిది మరోసారి తెలియజేసేందుకు.

"ఇష్టం లేక కాదు. అయినా యీనాళ చాలా బిజీగా వున్నారేమో మరి," అందామె.




ఆంధ్రప్రదేశ్ ఏజంట్లు:
మెసర్సు సీతారామ్ జనరల్ స్టోర్సు ఎజెన్సీస్
విజయవాడ, సికిందరాబాదు.

ఇంకా తనెలా ఉపేక్షించగలడు! ఉపేక్షిస్తే తనకు మర్యాద తెలీదనుకోరూ! అందుకే పాతవాతలు మర్చిపోయి చటుక్కున తను నోరు జారేశాడు:

"అదేమిటి రాజేశ్వరీ! యీ మాత్రం దానికే యింత బాధపడాలా! అయినా చెట్టంత మనిషిన్నుండగ ఎందుకూ! సాయంత్రం మొదటాటకి వెళ్దాం. పిన్నిగార్ని తీసుకుని రండి. ఆరుగంటలకి మీరు రావొచ్చు. ముందుగా నేవెళ్ళి టిక్కట్లు తీసుకుంటాను. ఏం అభ్యంతరం ఏముంది!" అన్నాడు అతిసునాయాసంగా వాళ్ళయితే అభ్యంతరం చెప్పలేదు.

కాని తీరా యింతా అనేశాక చాలా నొచ్చుకున్నాడు. తనే! అన్నందుకు కాదుగాని ఆ మాట నిలబెట్టుకోగలనా లేదా అని, కాని పరిస్థితి యిప్పుడు చేతులు దాటింది. రోట్లో తల దూర్చాక యెలాగో నిగ్రహించుకోవాలి. కాకపోయినా యిది ఒకవిధంగా తనకు మంచికే వచ్చిందేమో. తన మీద పరిసరాల్లో ప్రచారంలో వున్న అభిప్రాయాల సంగతి రాజేశ్వరి దాకా రాలేదింకా. ఈ లోపునే తానెలాగైనా యీ మాట కాస్తా నిలబెట్టుకుంటే— రేపొద్దున్న ఏ రామావతారంగాడో వచ్చి తారకం యిలాంటి మనిషని చెప్పినా రాజేశ్వరి ఛస్తే నమ్మదు. పైగా ఒక వ్యక్తి దగ్గర, అందులోనూ రాజేశ్వరిలాంటి యువతి చేత తను మంచి మనిషి అంటే అన్న మాట అక్షరాల జరిపేవాడని అన్పించుకునేందుకు యీ చాన్సు తప్పితే యింకోటి దొరకదు. అందుకే తనుగట్టిగా నిశ్చయించుకున్నాడు. తన మాట మన్నించి తప్పకుండా సాయంత్రం రమ్మనమని మరీ మరీ హెచ్చరించి యింటి దారిపట్టాడు.

* * *

ఈరోజు తారకనామం తన జీవితంలో చేయలేని యేదో ఘనకార్యం చేస్తున్నట్టు ఫీలయ్యాడు. ఎటువంటి అంతరాయాలొచ్చినా తానీరోజు వాటిని తృణప్రాయంగా యెదుర్కోగలడు! భూనభోంతరాళాలు ఏకమయినా సరే, ఎవరడ్డొచ్చినా, ఎంత అవసరమైన పని ముంచుకున్నా తానీరోజు చేసే పని మాత్రం అదొక్కటే! రాజేశ్వరితో మొదటాట సినిమాకెళ్లి ఆమె చాత "థాంక్స్" చెప్పించుకుని తన పరువు నిలబెట్టుకోవాలి! అందుకు విఘాతంగా ఏమొచ్చినా తను ఖాతర్చెయ్యదల్చుకోలేదు. చెయ్యలేదు కూడానూ!

ఏ స్నేహితులింటికీ వెళ్ళలేదు. ఎవ్వరికీ యీ సంగతి చెప్పలేదు. మధ్యాహ్నం కోటీశ్వరరావు పేకాటకు రమ్మని బలవంతం చేసినప్పుడు కూడా రానని ఖచ్చితంగా చెప్పగలిగాడు. చివరికి వదిన సాయంత్రం బజారు పని పురమాయించినప్పుడుకూడా మొహమాటపడలేదు.

'ఏం కావల్సినా రేపొద్దున్నే' అన్నాడు

'ఇప్పుడేం చెయ్యాలి కనక' అంది ఒదిన.

'సినిమాకు వెళ్తున్నా' అన్నాడు. తానిలా ఎప్పుడూ చెప్పలేదు.

'కలిసి వెళ్ళకూడదూ?' ప్రశ్నించిందొదిన.

'లేదు. యివాళతో ఆఖర్రోజు సరి.'

'పోనీ రెండో ఆట.'

'లాభంలేదు. మొదటాటకి రమ్మని ఒకర్ని రమ్మని ఆహ్వానించాను. వాళ్ళు పాపం యెదురు చూడరూ!'

'అలాగా! అయితే సరే వెళ్ళు' అన్నది ఒదిన.

వదినకు మనసులోనే వెయ్యినమస్కారాలర్పించి గబగబా సినిమాహాలుచేరుకున్నాడు నాలుగున్నరకే. రూపాయి పావలా టిక్కెట్ల క్యూలో నించుని మరోసారి తన అదృష్టాన్ని స్మరించుకున్నాడు. నిజంగా తను అనుకున్న రోజున చేస్తానని చెప్పిన పని చేస్తున్నాడివ్వాళ.

లోపల మేటినీ అవుతోంది. హాలుబయట అక్కడక్కడా జనం గుంపులు గుంపులుగా గుమిగూడి వున్నారు. చిన్న చిన్న దుకాణాలు అక్కడక్కడా జల్లిన నువ్వులా వున్నాయ్. కొందరు ఆదుకాణాలచుట్టూ చేరారు. తారకం మూడు ఫసుకాసు టిక్కెట్లు పిడికిట్లో గట్టిగా పట్టుకుని ఆపద్వ్యూహంలోంచి బయటపడ్డాడు. నలుగురూ కన్పించే ఒక జంక్షన్ లో నిలబడి చూస్తున్నాడు. మేటినీ లాంగ్ బెల్ కొట్టేశారు. అంటే యింకో అయిదు నిమిషాల్లో లోపలి జనం బయటికొచ్చేస్తారు. బయటి వాళ్ళు లోపలకెళ్ళిన మరో పది నిమిషాలకి మళ్ళీ ఆట ప్రారంభం అవుతుంది. వచ్చి పోయే రిక్షాలని పరీక్షిస్తున్నాడు తారకనామం. సమయంకూడా ఆరు గంటలు దాటుతోంది.

లోపలిజనం బయటపడుతున్నారు. ఓ యబ్బ! ఏం జనం! ఆడవాళ్ళూ మగవాళ్ళూ పుట్టలో చీమల్లా వస్తున్నారు. తను విస్తుపోయి చూస్తున్నాడల్లాగే ముందునుంచీ వెనకనించీ సాగిపోతూన్న వాళ్ళందర్నీ. అందరు హుషార్ గా కబుర్లు చెప్పుకుపోతున్నారు. రిక్షాల వాళ్ళు గంట కొడుతూ ఇటూ అటూ తిరుగుతున్నారు.

'ఏం రిక్షా' అన్నదొక శ్రావ్యమైనకంఠం.

తను చటుక్కున తిరిగి చూశాడు. తేలిపోతూన్న పాదాల్ని బరువుగా రెండడుగులు ముందుకేశాడు.

'ఓహ్. తారకం బాబుగారే పిన్నీ!' అన్నది అదేకంఠం. ఇద్దరు స్త్రీలు ఆగి తిరిగి చూశారు.

'మేట్నీ చూసివస్తున్నారా రాజేశ్వరీ?' అతికష్టంమీద మాటలు పెగిలాయి తారకనామానికి.

రాజేశ్వరి తెల్లని మొహం మరీ తెల్లనై పోయింది.

'క్షమించండి. నేనెంతో చెప్పాను. అయినా నామాట వాళ్ళు నమ్మలేదు. మామయ్య మాట విని....

ఎవడీ మామయ్య? తనపాలిటిధూమకేతువు?

తారకం శాపగ్రస్తునిలా నిలబడ్డాడు.

'మధ్యాహ్నం వచ్చాడు. మీ గురించి మరేం కాదు...మీకెప్పుడూ ఏవో వెయ్యి వేపకాలనీ యేమిటో గొడవంతా...అతనికి మిమ్మల్ని బాగా తెలుసుట. అతనేనండి మా రామావతారం మామయ్య...ఇప్పుడిలా'

రొదచేసుకుంటూ పోతూన్న జనంలో విలీనమైపోయాడు తారకనామం. ★




అనేక సంవత్సరముల అనుభవముతో నవీన పద్ధతులలో మాచే తయారుచేయబడిన యినుపపెట్టెలు, ఉక్కు బీరువాలు, క్యాష్ బాక్సులు, మరియు ఆఫీసు రాకులు సరసమైన ధరలకు సకాలములో తయారుచేసి యివ్వగలము.

ఆంధ్రదేశపు ఈ పరిశ్రమను ప్రోత్సహించండి.

ఆంధ్ర సేఫ్ కంపెని,

| షో రూము: | వర్కు షాపు: |
| --- | --- |
| సరస్వతీటాకీస్ రోడ్, | మునిసిపల్ ఆఫీసురోడ్, |
| విజయవాడ-1. | విజయవాడ-1. |

బ్రాంచి: ప్రకాశంరోడ్ - విజయవాడ-2.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యపట్టణములలో సేల్సుఏజంట్లు కావలెను. వివరములకు వ్రాయండి